సాక్షి మెదక్

గురువారం । 14 । ఆగస్టు । 2025



యువ వికాసం ఏదీ?

రాజీవ్ యువవికాసం కింద నిరుద్యోగ యువతకు రుణాలు ఇవ్వకపోవడంతో నిరాశలో ఉన్నారు. వివరాలు 8లో ▸



డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం కావాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు యువతకు పిలుపునిచ్చారు. వివరాలు 8లో ▸



టీఎల్ఎంతో సులభంగా బోధన

టీఎల్ఎం ద్వారా విద్యార్థులకు సులభంగా బోధన ఉంటుందని ఎంఈఓ బుచ్చనాయక్ అన్నారు. వివరాలు 9లో ▸

ఎఫ్ఆర్ఎస్

గాడినపడుతున్న గురువులు

పాపన్నపేట మండలం మదిరె కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలను జూన్ 19న ఉదయం 9 గంటలకు 'సాక్షి' విజిట్ చేయగా .. పాఠశాల తాళాలే తెరుచుకోలేదు. అలాగే మరో రెండు పాఠశాలల్లో నలుగురు ఉపాధ్యాయులకు, ఒక్కరే హాజరయ్యారు. నేడు పరిస్థితి మారింది. ఎఫ్ఆర్ఎస్ (ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్)తో గురువులు గాడిన పడుతున్నారు. ఉరుకులు పరుగుల మీద ఠంచన్‌గా ప్రార్థనకు హాజ రవుతున్నారు. సీపీఎస్‌లో సాయంత్రం 4, ఉన్నత పాఠశాలలో 4.15 గంటల వరకు పక్కాగా ఉంటున్నారు. ఎఫ్ఆర్ఎస్ అమల్లోకి వచ్చిన 13 రోజుల్లోనే మార్పు కనిపిస్తుంది.



టీచర్లు, విద్యార్థులతో కళకళలాడుతున్న పొడిచన్‌పల్లి పాఠశాల

- పెరుగుతున్న హాజరుశాతం
- జిల్లాలో 4,266 మంది టీచర్లు విధులు
- పూర్తిగా తొలగని సాంకేతిక సమస్యలు

మెదక్ అర్బన్: జిల్లాలో సుమారు 90 శాతం మంది టీచర్లు స్థానికంగా ఉండటం లేదు. సమీప పట్టణాలు.. సొంత గ్రామాల నుంచే విధులకు హాజరవుతున్నారు. సుమారు 100 కి.మీ నుంచి బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో వస్తుండటంతో బడికి ఆలస్యంగా రావడం, ముందుగా వెళ్లడం పరిపాటిగా మారింది. ఈ విధానానికి చెక్ పెట్టేందుకు విద్యాశాఖ ఈనెల 1 నుంచి ఎఫ్ఆర్ఎస్ (విధానం అమల్లోకి తెచ్చింది. నమోదులో కొన్ని సమస్యలున్నా.. దాదాపు ముఖ గుర్తింపు నమోదవుతుంది. సాధారణంగా స్టాఫ్ సంఖ్య ఆధారంగా 10 శాతానికి మించి క్యాజువల్ లీవ్‌లు ఇవ్వొద్దు. దీంతో ఇష్టారాజ్యంగా టీచర్లు సెలవులు పెట్టే అవకాశం లేకుండా పో యింది. 80 శాతం కన్నా, టీచర్ల హాజరు శాతం తగ్గితే కలెక్టర్, సంబంధిత కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఎ ంఈఓ వివరణ కోరే అవకాశం ఉంది. దీంతో విద్యార్థుల బోధనకు ఆటంకం లేకుండా ఉంటుంది.

అత్యధికం 87.. అత్యల్పం 74 శాతం

జిల్లాలో మొత్తం 4,266 మంది టీచర్లు పని చేస్తున్నారు. ఈనెల 1 నుంచి ఎఫ్ఆర్ఎస్ విధానం అమల్లోకి వచ్చింది. మొదటి రోజు సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు ఏర్పడినప్పటికీ, ఈనెల 2న 69 శాతం, 4న 81, 5న 81, 6న 87, 7న 84, 11న 81, 12న 83 శాతం హాజరు నమోదైంది. కాగా బుధవారం 3,120 మంది టీచర్లు ఎఫ్ఆర్ఎస్‌లో సమయానికి నమోదయ్యారు. 547 మంది సెలవులో ఉన్నారు. మిగితా టీచర్లది వివిధ కారణాలతో హాజరు నమోదు కాలేదని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. అయితే ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో ఇంకా కొన్ని సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిసింది. రెండు, మూడు రోజుల్లో సమస్యలు పరిష్కారం అవుతాయని అధికారులు చెబుతున్నారు.

సమయపాలన పాటిస్తున్నారు



ఎఫ్ఆర్ఎస్ విధానం అమల్లోకి వచ్చాక, సమయపాలన ఖచ్చితంగా అమలవుతుంది. టీచర్లు బాధ్యతాయుతంగా విధులకు హాజరవుతున్నారు. సాయంత్రం పాఠశాల సమయం వరకు విధులు నిర్వర్తిస్తున్నారు. ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో కొన్ని సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయి. వాటిని మూడు, నాలుగు రోజుల్లో పరిష్కరిస్తాం.

– రాధాకిషన్, డీఈఓ

న్యూస్‌రీల్

పఠనాసక్తిని పెంపొందించాలి



చేగుంట: బోధనోపకరణాలను పరిశీలిస్తున్న డీఈఓ రాధాకిషన్

చేగుంట(తూప్రాన్)/చిన్నశంకరంపేట/ మెదక్ కలెక్టరేట్ /తూప్రాన్: విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించే అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని చదువు నేర్పాలని డీఈఓ రాధాకిషన్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనోపకరణాల మేళాను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు ఆసక్తిగా చదువుకునే విధంగా బోధనోపకరణాలతో చదివించాలన్నారు. అనంతరం చిన్నశంకరంపేట మోడల్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన మండల స్థాయి టీఎల్ఎం మేళాను సందర్శించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన టీఎల్ఎం మేళాలో పాల్గొన్నారు. అలాగే తూప్రాన్‌లో జరిగిన కార్యక్రమానికి ఆర్డీఓ జయచంద్రారెడ్డి, జెడ్పీ సీఈఓ ఎల్లయ్యతో కలిసి హాజరయ్యారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

నర్సాపూర్: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని బస్టాండ్ సమీపంలో పోలీసులు మాదక ద్రవ్యాల నిరోధక కార్యక్రమం నిర్వహించి ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం అవుతుందని, ఎవరైనా అమ్మినట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహిపాల్‌రెడ్డి, సీఐ జాన్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ లింగం,ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం న ర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. గోవులు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

నేడు క్రీడాకారుల ఎంపిక

మెదక్ కలెక్టరేట్: అంతర్జాతీయ పాఠశాలల వాలీబాల్ పోటీల్లో పాల్గొనేందుకు గురువారం మెదక్‌లో క్రీడాకారుల ఎంపిక చేపట్టనున్నట్లు పాఠశాల క్రీడా సామాఖ్య కార్యదర్శి నాగరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు ఉదయం 9 గంటల నుంచి జిల్లా కేంద్రంలోని గుల్షన్ క్లబ్‌లో ఎంపిక ఉంటుందన్నారు. క్రీడాకారులు 15 సంవత్సరాలలోపు వారై ఉండాలని, వెంట ఒరిజినల్ వయసు ధృవీకరణ పత్రం, 5 కలర్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకొని రావాలన్నారు. బాలురు 8 మంది, బాలికలు 8 మందిని ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన రెండు జట్లు ఈనెల 18, 19 తేదీల్లో రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పూర్తి సమాచారం కోసం 9985111011, 89855 36704 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మహిళలను సంఘాల్లో చేర్పించాలి

నర్సాపూర్: మహిళలను సంఘాలలో చేర్పించాలని నాన్ ఫాం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మల్లేశం చెప్పారు. బుధవారం ఐకేపీ కార్యాలయంలో జరిగిన మండల సమాఖ్య ప్రతినిధుల ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలను కోటీశ్వరులను చేయాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మక కార్యక్రమం చేపట్టిందన్నారు. 60 ఏళ్లు దాటిన మహిళలతో వయోవృద్ధుల సంఘాలు ఏర్పాటు చేయాలని, 14 నుంచి 18 సంవత్సరాల లోపు కిశోర బాలికల సంఘాలు, దివ్యాంగుల సంఘాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో మండల సమైఖ్య కార్యదర్శి మౌనిక పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం

అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్ కలెక్టరేట్: డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యమని, జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ నగేశ్ అధికారులకు సూచించారు. బుధవారం నషాముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో అధికారులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఓవర్ డ్యూటీ!

- రోజుకు 12 నుంచి 14 గంటల విధులు
- స్పెషల్ ఆఫ్‌లు.. సెలవులు కరువు
- ఇదేంటని అడిగితే మెమోలు..
- ఆందోళనలో డ్రైవర్లు, కండక్టర్లు

మెదక్‌జోన్: ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ఓవర్ డ్యూటీతో శారీరకంగా, మానసికంగా అలసిపోతున్నారు. నిబంధనల ప్రకారం రోజుకు 8 గంటలు మాత్రమే విధులు నిర్వర్తించాలి. అంతకుమించి పనిచేస్తే ఆ మరుసటి రోజు సెలవు ఉంటుంది. ప్రస్తుతం రోజుకు 12 నుంచి 14 గంటల పాటు విధులు నిర్వర్తించాల్సి వస్తుంది. 14 గంటల పాటు విధుల్లో ఉంటే 6 గంటలకు ఓవర్ టైం (ఓటీ) ఇవ్వాల్సి ఉండగా, కేవలం గంటన్నర, లేదా రెండు గంటలకు మాత్రమే ఓటీ ఇస్తున్నారని సిబ్బంది వాపోతున్నారు. గతంలో సెలవులు ఇచ్చేవారని, సమ్మె అనంతరం అవి కూడా ఇవ్వడం లేదని ఆవేదన చెందుతున్నారు.

100 బస్సులు.. 350కి పైగా సిబ్బంది

మెదక్ డిపోలో పల్లె వెలుగు నుంచి మొదలుకొని ఎక్స్‌ప్రెస్, లగ్జరీ, సూపర్ లగ్జరీలు మొత్తం సుమారు 100 బస్సులు ఉండగా, డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది 350కి పైగా ఉన్నారు. కాగా కార్మిక చట్టాల ప్రకారం డ్రైవర్, కండక్టర్లు రోజుకు 8 గంటలు మాత్రమే విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. అయితే అంతకంటే ఎక్కువ సమయం పని చేయాల్సి వస్తోందని డ్రైవర్లు వాపోతున్నారు. కార్మికులపై వేధింపులు ఆపాలనే డిమాండ్‌తో గతేడాది జూన్‌లో 53 మంది డ్రైవర్లు 3 రోజుల పాటు బస్సులు నిలిపి వేసి సమ్మెకు దిగారు. దీంతో దిగివచ్చిన యాజమాన్యం కార్మిక చట్టం ప్రకారం వెసులుబాటు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అందరూ విధుల్లో చేరాలని, ఉన్నతాధికారులతో చర్చించి సమ్మె చేసిన మూడు రోజుల వేతనాలు ఇస్తామని నిరసనను విరమింపజేశారు.

రూ. 24 లక్షలు జరిమానా

అధికారుల హామీతో సమ్మె విరమించిన డ్రైవర్లు ఆ మరుసటి రోజు విధుల్లో చేరారు. అయితే డ్రైవర్లకు హక్కుల ప్రకారం న్యాయం చేయకపోగా, మూడు రోజుల పాటు బస్సులు నడపకుండా సమ్మె చేసినందుకు ఆర్టీసీకి రూ. 24 లక్షల నష్టం వచ్చిందని, ఆ మొత్తాన్ని సమ్మెలో పాల్గొన్న 53 మంది డ్రైవర్లు చెల్లించాలని స్పష్టం చేశారు. ఇందుకోసం ఒక్కో డ్రైవర్‌కు రూ. 45 వేల చొప్పున జరిమానా విధించారు. ఈ మొత్తాన్ని ప్రతి నెల ఒక్కో డ్రైవర్ వేతనంలో నుంచి రూ. 5,500 చొప్పున కోతపెట్టారు. ఈక్రమంలో బాధిత డ్రైవర్లు కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు స్టే విధించడంతో ప్రస్తుతం వేతనాల్లో నుంచి కోత పెట్టడం మానేశారు. కాగా అప్పటి నుంచి యాజమాన్యం వేధింపులు మరింతగా ఎక్కువగా అయ్యాయని డ్రైవర్లు వాపోతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే మెమో ఇచ్చి ఇంక్రిమెంట్లు ఆపుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మెదక్ బస్ డిపో

నిబంధనల ప్రకారమే..

నిబంధనల ప్రకారమే డ్యూటీలు వేస్తున్నాం. అధిక సమయం పనిచేసిన వారికి ఓటీలు ఇస్తున్నాం. గతంలో డ్రైవర్లు సమ్మె చేసిన విషయం నాకు తెలియదు. తాను గతేడాది ఆగస్టులో విధుల్లో చేరాను.

– సురేఖ, డీఎం మెదక్

అప్రమత్తంగా ఉండండి

- జిల్లాకు భారీ వర్ష సూచన
- తక్షణ సాయం కోసం కంట్రోల్ రూం ఏర్పాటు
- కలెక్టర్ రాహుల్‌రాజ్



స్వాతంత్య్ర వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ శ్రీనివాసరావు

మెదక్ కలెక్టరేట్: మూడు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు పడనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 15న జరగనున్న స్వాతంత్య్ర వేడుకల ఏర్పాట్లను ఎస్పీ డీవీ శ్రీనివాసరావుతో కలిసి బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఏర్పాట్లు ఘనంగా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం వర్షాల నేపథ్యంలో ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన సహాయక చర్యలపై శాఖలవారీగా దిశానిర్దేశం చేశారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధికార యంత్రాంగం అండగా ఉంటుందన్నారు. అత్యవసర సేవలు అందించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశామన్నారు. తక్షణ సాయం కోసం 9391942254 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓ రమాదేవితో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

చిలప్‌చెడ్(నర్సాపూర్): వానాకాలం సీజన్‌లో పశువులు వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉంటూ ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. బుధవారం మండలంలోని బండపోతుగల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని సందర్శించారు. రికార్డులు పరిశీలించి జీవాలకు టీకాలు వేశారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం రైతులకు పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేశారు.

జాతీయ సమైక్యత కోసమే 'తిరంగా'



పట్టణంలో భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్

నర్సాపూర్: కుల, మత, ప్రాంతాలకు అతీతంగా భారతీయుల్లో జాతీయతను పెంపొందించడానికే తిరంగా యాత్ర చేపడుతున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ చెప్పారు. బుధవారం నర్సాపూర్‌లో చేపట్టిన తిరంగా యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆపరేషన్ సింధూర్ విజయోత్సవాన్ని స్వాగతించడం, ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకోవడంతో పాటు దేశాన్ని అభివృద్ధి పథంలో నడపడానికి స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించే దిశగా స్వదేశీ జాగరణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. కాగా విద్యార్థులతో భారీ తిరంగా జెండాతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోశ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేశ్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్, పెద్ద రమేశ్‌గౌడ్, బుచ్చేశ్‌యాదవ్, రాజేందర్ పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న జూనియర్ కళాశాల విద్యార్థులు

అదనపు బస్సుల కోసం ఆందోళన

చేగుంట(తూప్రాన్): అదనపు బస్సులు నడపాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు బుధవారం మోడల్ పాఠశాల వద్ద రాస్తారోకో నిర్వహించారు. బీ. కొండాపూర్ నుంచి చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బోనాల్, ఇబ్రహీంపూర్, రుక్మాపూర్, అనంతసాగర్, ఉల్లితిమ్మాయిపల్లి, అనంతసాగర్ గ్రామాలకు చెందిన విద్యార్థులు వస్తుంటారు. ఈరూట్‌లో మోడల్ పాఠశాల బస్సు ఒక్కటి మాత్రమే నడుస్తుండటంతో దాదాపు 200కు పైగా విద్యార్థులు ఒక్క బస్సులో వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల అవి సైతం అందుబాటులో లేకపోవడంతో కళాశాలకు హాజరుకాలేక పోతున్నారు. దీంతో ఆగ్రహించిన విద్యార్థులు మోడల్ పాఠశాల సమీపంలో ధర్నా నిర్వహించారు. ఆర్టీసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి.. వారం రోజుల్లో సమస్యను పరిష్కరించకుంటే జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు.

స్వాతంత్య్ర వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి వివేక్



మెదక్ కలెక్టరేట్: రేపు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరు కానున్నారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించింది. పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే వేడుకల్లో మంత్రి పాల్గొని జాతీయ పతాక ఆవిష్కరణ, గౌరవ వందనం స్వీకరించనున్నారు. అనంతరం పురస్కారాలు ప్రదానం చేయనున్నారు.

రైతు చట్టాలపై అవగాహన అవసరం

రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు సునీల్



చేగుంటలో మాట్లాడుతున్న సునీల్

నర్సాపూర్/కౌడిపల్లి/కొల్చారం/చేగుంట(తూప్రాన్)/చిన్నశంకరంపేట(మెదక్): రైతు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు సునీల్ అన్నారు. లీఫ్స్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నర్సాపూర్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన సాగు న్యాయ యాత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చట్టాలను రైతులకు చుట్టాలుగా చేయాలనే లక్ష్యంతో సాగు న్యాయ యాత్ర చేపట్టినట్లు వివరించారు. రైతులు భూ, సాగు నీటి సమస్యలు, విత్తనం, పంట రుణాలు, పంటల బీమా మార్కెట్ తదితర వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. భూమికి సంబంధించిన సమస్యలు, నాణ్యతలేని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో నష్టం వాటిల్లితే చట్టాలను ఉపయోగించుకొని రైతులు న్యాయం పొందే అవకాశం ఉందన్నారు. సమావేశం అనంతరం మండలంలోని పెద్దచింతకుంటలో పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అలాగే కౌడిపల్లి, కొల్చారం, చేగుంట, చిన్నశంకరంపేటలో పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. భూదాన్ బోర్డు మాజీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ ఓఎస్‌డీ శ్రీహరి వెంకటప్రసాద్, అధికారులు రైతులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

జెడ్పీ సీఈఓ ఎల్లయ్య

తూప్రాన్: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ కోసం తీసుకోవాల్సిన పలు అంశాలను వివరించారు. భారీగా కురుస్తున్న వర్షాలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ప్రభుత్వ భవనాలకు సోలరైజేషన్ అవసరాలను గుర్తించాలని సూచించారు.

స్వచ్ఛతకు దూరం!

పేట మున్సిపాలిటీలో కొరవడిన పరిశుభ్రత



మురుగు కాలువలు శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

- పారిశుద్ధ్య నిర్వహణలో విఫలం
- స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో అట్టడుగు స్థానం

మున్సిపాలిటీ	రాష్ట్ర ర్యాంక్	జాతీయ ర్యాంక్
రామాయంపేట	1321,	591

రామాయంపేట(మెదక్): రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛత కొరవడింది. తడి, పొడి చెత్త సేకరణ, పారిశుద్ధ్య పనుల నిర్వహణ, ఇతర రంగాల్లో అనుకున్న పురోగతి సాధించలేక చతికిల పడింది. దీంతో స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లోనూ జిల్లాలోనే అట్టడుగు స్థానంలో నిలిచింది.

లోపించిన సమన్వయం

పట్టణాల్లో స్వచ్ఛతలో పోటీ తత్వాన్ని పెంపొందించడానికి ఏటా కేంద్రం స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలు నిర్వహిస్తుంది. చెత్త సేకరణకు సంబంధించి వివిధ అంశాల ప్రతిపాదికన ఈ ర్యాంక్ నిర్ణయిస్తారు. ఇంటింటికీ తిరిగి చెత్త సేకరిస్తున్నారా..? సేకరించిన తడి, పొడి చెత్తను వేర్వేరు చేస్తున్నారా.. అనే విషయం కమిటీ పరిశీలిస్తుంది. ఈమేరకు కమిటీ సభ్యులు పట్టణంలో పరిశుభ్రత, పారిశుద్ధ్య కార్యక్రమాలపై స్థానికుల అభిప్రాయాలను సేకరించడంతో పాటు ప్రత్యక్షంగా వార్డుల్లో పర్యటించి పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించారు. మున్సిపాలిటీల్లో ఆయా అంశాలకు సంబంధించి కేటాయించిన మార్కుల ఆధారంగా ర్యాంకులను ఖరారు చేశారు. కేంద్ర బృందం సభ్యులు పట్టణంలో పర్యటించిన సమయంలో స్వచ్ఛత లోపించిన విషయం ప్రత్యక్షంగా పరిశీలించి ఫొటోలు సేకరించారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో పారిశుద్ధ్యం లోపించి, దోమల బెడద తీవ్రమై స్థానికులు వ్యాధుల బారిన పడుతున్నారు. గుట్టపై ఎత్తైన ప్రదేశంలో ఉన్న డంప్‌యార్డులో కాకుండా పట్టణంలో సేకరించిన చెత్తను ఎక్కడ పడితే అక్కడే వేస్తున్నారు. ఫలితంగా వార్డుల్లో దుర్వాసన వెదజల్లుతుంది. ఈవిషయమై పలుమార్లు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ హెచ్చరించినా మున్సిపల్ అధికారుల వైఖరి మారలేదు. ఫలితంగా స్వచ్ఛత ర్యాంక్ దిగజారింది. ఈ విషయమై పట్టణ ప్రజలు సైతం పెదవి విరుస్తున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం



మున్సిపాలిటీలో స్వచ్ఛత విషయమై చర్యలు తీసుకుంటున్నాం. ఈమేరకు కొంత పురోగతి సాధించాం. అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. డంప్‌యార్డులో కాకుండా ఇతర ప్రదేశాల్లో వేసిన చెత్త, చెదారాన్ని తొలగిస్తున్నాం.

– దేవేందర్, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం ఆగదు


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీసీ నాయకులు

సంగారెడ్డి: 42శాతం రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటం ఆగదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ కృష్ణ పేర్కొన్నారు. బుధవారం సంగారెడ్డిలో మహాసభ వాల్ పోస్టర్‌ను ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభు గౌడ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీసీలకు చట్టసభల్లో సరైన రిజర్వేషన్లు అమలు కాలేదన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో ఈ నెల 31న రవీంద్రభారతిలో మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు కులాలకు అతీతంగా అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. రిజర్వేషన్లపై అఖిలపక్ష నేతలతో కమిటీ వేసి, 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని జాతీయ ప్రధాన కార్యదర్శి కోలా జనార్దన్ డిమాండ్ చేశారు.

సుంకాన్ని రద్దు చేయాలి


ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: అమెరికా భారతదేశంపై 50 శాతం సుంకం విధించడాన్ని వ్యతిరేకిస్తూ క్విట్ ఇండియా స్ఫూర్తితో ఉద్యమించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెహమాన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. క్విట్ కార్పోరేట్ అనే నినాదంతో ఏఐటీయూసీ, రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం అమెరికా దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. భారతదేశం, రష్యా నుంచి ఆయిల్ కొంటున్నారనే నెపంతో అమెరికా ఎగుమతి, దిగుమతులపై సుంకం విధించడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, శివశంకర్, మెహబూబ్ ఖాన్, ఖాజా, శివలీల, నర్సమ్మ, మహేశ్, సుజాత, సునీత,పద్మమ్మ పాల్గొన్నారు.

వరి సాగులో యూరియా తగ్గించాలి


వరి పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

కల్హేర్(నారాయణఖేడ్): వరి సాగులో యూరియా వాడకం తగ్గించాలని ఏడీఏ నూతన్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని మహదేవుపల్లిలో వరి పొలాలను పరిశీలించి, కాంప్లెక్స్ ఎరువులు వాడవద్దని సూచించారు. మొక్క ఎదుగుదల కోసం దుక్కిలో మాత్రమే డీఏపీ లేదా సింగిల్ సూపర్ ఫాస్పేట్ మందును వాడాలని సూచించారు. నాలుగు దఫాలుగా యూరియా వాడాలని, ఎక్కువ వాడితే తెగుళ్లు వస్తాయని వివరించారు. పెట్టుబడి తగ్గించుకునేందుకు నానో డీఏపీ, నానో యూరియా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బీబీపేట్ పీఏసీఎస్‌లో ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశం, రైతులు చంద్రమోహన్, బాలయ్యపాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


కనకరాజు

వర్గల్(గజ్వేల్): డ్యూటీకి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం... గజ్వేల్ సమీప ఆర్అండ్ఆర్ కాలనీ ఎర్రవల్లికి చెందిన ముచ్చర్ల కనకరాజు(30) వర్గల్ మండలంలోని సింగాయపల్లిలోని ప్రైవేటు సీడ్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం విధులకు వెళ్లాడు. డ్యూటీ ముగిసిన తరువాత ఇంటికి రాలేదు. అతని ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబీకులు బంధువులు, చుట్టుపక్కల వెతికినప్పటికి ఆచూకీ దొరకలేదు.

యువ వికాసమేదీ?

నైరాశ్యంలో నిరుద్యోగులు
- ఎదురు చూపుల్లో లబ్ధిదారులు
- జాప్యంతో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ
- యువతలో ఎన్నికల నోటిఫికేషన్ భయం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలని సంకల్పించింది. యువత నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు స్వీకరించి, లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితాను సైతం ఉన్నతాధికారులకు పంపించింది. కానీ రుణాలు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు నిరాశలో ఉన్నారు. – హుస్నాబాద్


హుస్నాబాద్ మున్సిపాలిటీ భవనం

రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు రూ.50వేలు, రూ.లక్ష , రూ.2లక్షలు, రూ.3లక్షలు, రూ.4లక్షల లోపు సబ్సిడీతో రుణాలు మంజూరు చేయనుంది. హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 5 కేటగిరిల కింద ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను తీసుకున్నారు. వివిధ కార్పొరేషన్ల ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు అధికారులు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. పథకం కింద మొత్తం 1528 దరఖాస్తులు వచ్చాయి. రూ.50వేల లోపు వాటికి బ్యాంక్ లింకేజీ లేకుండా పూర్తి సబ్సిడీ, రూ.లక్ష నుంచి రూ.4లక్షల వరకు ఇచ్చే రుణాలను బ్యాంకు లింకేజీ ద్వారా సబ్సిడీ ఇచ్చేలా పథకాన్ని రూపొందించారు. మొదట రూ.50వేలు, రూ.లక్షలోపు వారికి బ్యాంకుల ద్వారా గ్రౌండింగ్ చేసేందుకు లబ్ధిదారులను ఎంపిక చేసి బ్యాంకుల వారీగా జాబితాను అధికారులు సిద్ధం చేశారు. ఈ జాబితాను ఉన్నతాధికారులకు కూడా అందజేశారు.

రుణాల కోసం ఎదురుచూపులు

యువ వికాసం కింద దరఖాస్తు చేసుకుని దాదాపు మూడు నెలలు గడిచిపోయింది. ఇప్పటికే రూ.50వేలు, రూ.లక్ష యూనిట్ల కింద అర్హులైన లబ్ధిదారుల జాబితాను ఉన్నతాధికారులకు పంపించారు. బ్యాంకర్లు ఇచ్చే జాబితాతోపాటు లబ్ధిదారుల ఎంపికలో అధికార పార్టీ నాయకుల పాత్ర ఉందని ప్రచారం జరుగుతోంది. జూన్ 2న లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందిస్తామని ప్రకటించింది. అనివార్య కారణాల వల్ల రుణాల అందజేత వాయిదా వేశారు. దీంతో లబ్ధిదారులు రుణాల కోసం ఎదురు చూస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కార్పొరేషన్ రుణాలు మంజూరు కాలేదు. ఈ ప్రభుత్వంలో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించడంతో రుణాలు పొందుతామని ఆశపడ్డారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడైనా జారీ చేసే అవకాశం ఉండటంతో వారిలో ఆందోళన మొదలైంది. ఇప్పటికే రుణాల జాబితాను ఎప్పుడు ప్రకటిస్తారోనని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. రుణాలను సకాలంలో గ్రౌండింగ్ చేయకుండా, స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేస్తే మరో 6 నెలల వరకు వేచి ఉండాల్సిందే. నోటిఫికేషన్ ముందుగానే రుణాలు మంజూరు చేస్తుందా? లేదా అనేది వేచి చూడాలి.

ఉన్నతాధికారులకు పంపించాం



రాజీవ్ వికాస పథకం కింద నిరుద్యోగ యువత ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ దరఖాస్తులను పరిశీలించి ఆయా బ్యాంకులకు పంపించాం. బ్యాంకులు ఎంపిక చేసిన జాబితాను ఉన్నతాధికారులకు పంపించాం. రుణాల గ్రౌండింగ్ తుది నిర్ణయం ప్రభుత్వానిదే. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత జాబితాను ప్రకటిస్తాం.

–మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్, హుస్నాబాద్

స్టాక్ పేరుతో సైబర్ మోసం

రూ.39 లక్షలు పోగొట్టుకున్న వ్యాపారి

పటాన్‌చెరు టౌన్: స్టాక్ మార్కెట్ పేరుతో సైబర్ నేరగాళ్లు వ్యాపారిని బురిడీ కొట్టించారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్‌కు చెందిన ఆన్‌లైన్ సేవ వ్యాపారికి జూలై 16న స్టాక్ మార్కెట్‌కు సంబంధించి మెసేజ్ వచ్చింది. దీంతో అతడు తన వివరాలు నమోదు చేశాడు. దీంతో అపరిచిత స్టాక్ మార్కెట్ నిర్వాహకులు ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. పలు దఫాలుగా ఆన్‌లైన్‌లో మొత్తం రూ.39 లక్షల 50 వేలు పెట్టుబడి పెట్టాడు. కాగా అతడు పెట్టిన పెట్టుబడికి లాభాలు చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు తాను పెట్టిన నగదుతోపాటు లాభాలు ఇవ్వాలని అడగగా స్పందనలేదు. సైబర్ క్రైమ్, పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

టాస్కులు, కమిషన్‌ల పేరుతో..

సైబర్ వలలో చిక్కి ఉద్యోగి డబ్బులు పోగొట్టుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు పరిధిలోని బచ్చుగూడెంకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి జూలై 16న ఫోన్‌కు టాస్కులు చేస్తే కమిషన్ ఇస్తామని మెసేజ్ వచ్చింది. ఆ ఉద్యోగి తన వివరాలు నమోదు చేసింది. దీంతో అపరిచిత సైట్ నిర్వాహకులు వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. కాగా ఉద్యోగి పలుసార్లు నగదు చెల్లించి టాస్కులు చేసింది. బాధితురాలు మొత్తం రూ.19 లక్షల 99 వేలు చెల్లించింది. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లు వాలెట్‌లో నగదుతో పాటు కమిషన్ చూపిస్తూ వచ్చారు. మొత్తం డబ్బు, కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. మోసపోయినట్లు గ్రహించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ములుగు వర్సిటీ కృషి అభినందనీయం

సెంట్రల్ అగ్రికల్చర్ యూనివర్సిటీ వీసీ పాండే

ములుగు(గజ్వేల్): మౌలిక సదుపాయాలు, వనరులను అభివృద్ధి చేయడంలో ములుగు శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం చేస్తున్న కృషిని సెంట్రల్ అగ్రికల్చర్ యూనివర్సిటీ వీసీ డాక్టర్.పీ.ఎస్ పాండే అభినందించారు. ఆయన బుధవారం వర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతు ఆధారిత పరిశోధనలను మెరుగుపర్చడం, విద్యార్థి కేంద్రీకృత విద్యా కార్యక్రమాలను ప్రోత్సహించడం వంటి అంశాలను ప్రస్తావించారు. అంతర్ సంస్థాగత సహకారాలను పెంపొందించడం, ఉద్యాన విద్యలో వినూత్న సాంకేతికతలను స్వీకరించడం గురించి వివరించారు. అనంతరం పాండేను వీసీ రాజిరెడ్డి, అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారులు భగవాన్, రాజశేఖర్, శ్రీనివాసన్ పాల్గొన్నారు.


పాండేను సన్మానిస్తున్న వీసీ రాజిరెడ్డి, అధికారులు


తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎంపీ రఘునందన్‌రావు, తదితరులు

జాతీయ భావం పెంపొందించాలి

హర్ ఘర్ తిరంగా ర్యాలీలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మనందరికి రక్ష మన జాతీయ జెండా అని, విద్యార్థులకు చిన్ననాటి నుంచే ఆవశ్యకతను తెలియచేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల నుంచి హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఎంపీ ప్రారంభించారు. ఈ ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగి అంబేద్కర్ చౌరస్తా వద్ద ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా ప్రజల్లో జాతీయ భావం పెంపొందించాలన్నారు. భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు, సుభాష్ చంద్ర బోస్ లాంటి అమరవీరుల త్యాగఫలం మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యమన్నారు. ఆపరేషన్ సింధూర్‌ను ముందుండి ఇద్దరు మహిళలే నడిపించారన్నారు. ప్రస్తుతం పాఠ్యపుస్తకాల్లో జాతీయత గూర్చి బోధించడం లేదన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో ప్రతి ఒక్కరికీ జాతీయత గూర్చి తెలిసే అవకాశం ఉందన్నారు. ఎంపీకి విద్యార్థినులు రాఖీ కట్టగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శంకర్, పట్టణ అధ్యక్షుడు వెంకట్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల పాక దగ్ధం

- రెండు పాడి గేదెలు, 5 దూడలు మృతి
- నాలుగు లక్షల నష్టం

శివ్వంపేట(నర్సాపూర్): అగ్ని ప్రమాదంలో రెండు పాడి గేదెలతో పాటు మరో 5 దూడలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మండలంలోని బోజ్యా పంచాయతీ పరిధి మాల్యా తండాలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. గ్రామస్తుల వివరాల ప్రకారం... తండాకు చెందిన బానోత్ లక్ష్మణ్‌నాయక్ వ్యవసాయంతోపాటు పాడి గేదెలతో ఉపాధి పొందుతున్నాడు. పొలం వద్ద పాకలో రోజువారిగానే గేదెలను కట్టేసి ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి పాకకు నిప్పంటుకుంది. దీంతో పాకలో ఉన్న రెండు గేదెలు, 5 దూడలు అగ్నికి ఆహుతయ్యాయి. మరో రెండు గేదెలు తప్పించుకునే క్రమంలో గాయాలయ్యాయి. పాక పక్కనే ఉన్న గడ్డివాము సైతం కాలి బూడిదైంది. పాక చుట్టూ కట్టెలతో కంచె ఉండటం, పక్కనే గడ్డివాములో మంటలు అధికం కావడంతో పశువులు మృత్యువాత పడ్డాయి. గుర్తించిన తండా వాసులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. నర్సాపూర్ నుంచి తండాకు వచ్చిన ఫైరింజన్ పశువుల పాకకు వెళ్లేదారి బురదగా ఉండటంతో దిగబడింది. మృతిచెందిన మూగజీవాల విలువ రూ.4 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు విజ్ఞప్తి చేశాడు. ఆర్ఐ కిషన్, విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ రాజు, లైన్‌మెన్ భాగ్యరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కాగా పాక వద్ద దోమలు పారదోలేందుకు ఏర్పాటు చేసిన పొగే కారణమా? లేక విద్యుత్ వైర్లు తెగిపడటం వల్ల అగ్ని ప్రమాదం జరిగిందా? గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారా? అనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది.


వివరాలు సేకరిస్తున్న అధికారులు

అనుమానాస్పదస్థితిలో వృద్ధురాలి మృతి

జహీరాబాద్ టౌన్: ఓ వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని అనేగుంట గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా... గ్రామానికి చెందిన గొల్ల నర్సమ్మ(72) ఒంటరిగా ఉంటూ కల్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంది. మంగళవారం రాత్రి ఆమె ఇంట్లో దూలానికి ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది. బుధవారం విషయం తెలుసుకున్న గ్రామస్తులు కూతురు స్వరూపకు సమాచారం అందించారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- ప్రమాదంలో ఒకరి మృతి
- నలుగురికి గాయాలు


బాలయ్య

అల్లాదుర్గం(మెదక్): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని చిల్వెర గ్రామ చౌరస్తాలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ.శంకర్, గ్రామస్తుల వివరాల ప్రకారం ... గ్రామానికి చెందిన నాయకోటి బాలయ్య ఇరిగేషన్ శాఖలో ఏడుపాయలలో విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన ఇంట్లో శుభకార్యం ఉండటంతో తోటి ఉద్యోగులు పోచయ్య, ప్రవీణ్, గోపాల్, అంతయ్య, బాలయ్యలను ఆహ్వానించాడు. బుధవారం అందరు వచ్చారు. ఫంక్షన్ పూర్తయిన తరువాత తిరిగి ఆటోలో బొడ్మట్‌పల్లి వైపు వెళుతుండగా చిల్వెర బ్రిడ్జి వద్ద పెద్ద శంకరంపేట వైపు నుంచి అతివేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అప్పాజిపల్లి గ్రామానికి చెందిన బాలయ్య (24) తీవ్రంగా గాయపడటంతో అంబులెన్స్‌లో తరలిస్తుండగా మృతి చెందాడు. మరో నలుగురికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, గ్రామం వద్ద ఆర్టీసీ బస్సులు అతివేగంగా వెళ్లడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ గ్రామస్తులు రహదారిపై రాస్తారోకో చేశారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

ఎస్పీ డీవీ శ్రీనివాసరావు


ప్రతిజ్ఞలో పాల్గొన్న విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు

మెదక్ మున్సిపాలిటీ: డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వాములు కావాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం ఎదుట పోలీసు అధికారులు, సిబ్బందితో ఎస్పీ మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నషా ముక్త్ భారత్ అభియాన్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. జిల్లాలో డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు, అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. డీఎస్పీ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులతో నషా ముక్త్ భారత్‌పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, ఏఆర్ డీఎస్పీ రంగానాయక్ , డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌గౌడ్, ఇన్‌స్పెక్టర్ సందీప్‌రెడ్డి, ఆర్ఐ రామకృష్ణ, శైలేందర్, మణి పాల్గొన్నారు.

నియంత్రణ అందరి బాధ్యత: డీఎస్పీ ప్రభాకర్

పటాన్‌చెరు టౌన్: డ్రగ్స్ రహిత ప్రదేశంగా మార్చడానికి సాయశక్తులా కృషి చేస్తున్నామని, దీనికి అందరి సహకారం అవసరమని పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం 'నషా ముక్తి భారత్ అభియాన్'ను పురస్కరించుకుని రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో కమిటీ, స్థానిక పోలీస్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలన సవాలుగా మారిందని, దానిపై యువతకు అన్ని కోణాల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ , డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ శివ దీప్తి, డాక్టర్ సురేశ్ , ఎస్ఐలు శ్రీశైలం, హిమబిందు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ ప్రభాకర్

పరిశ్రమల్లో జాగ్రత్తలు తప్పనిసరి

చేగుంట(తూప్రాన్): పరిశ్రమలలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ప్రకాశ్‌రావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చిన్నశివునూర్ గ్రామంలోని వెంకటేశ్వర ప్రాడక్ట్ ప్రైవేటు పరిశ్రమలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమను మొత్తం పరిశీలించారు. కార్మికులకు సేఫ్టీకోసం ఉపయోగించే అన్ని పరికరాలను అందించాలని తెలిపారు. సేఫ్టీ నిబంధనలను పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పరిశీలనలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ నెహ్రూ, పరిశ్రమల నిర్వాహకులు ఉన్నారు.


పరిశ్రమను పరిశీలిస్తున్న అధికారులు

అయినాపూర్ జవాన్ అదృశ్యం

పంజాబ్‌లో ఏడు రోజులుగా లభించని ఆచూకీ


అనిల్

కొమురవెల్లి(సిద్దిపేట): ఓ ఆర్మీ జవాన్ పంజాబ్‌లో అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండలంలోని అయినాపూర్‌లో కలంకలం రేపింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన అనిల్ 11 ఏళ్లుగా ఆర్మీలో జవాన్‌గా పంజాబ్‌లోని అంబాల వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. జూలైలో అతనికి ప్రమోషన్ రావడంతో సికింద్రాబాద్‌లోని ఆర్మీ క్యాంపులో ట్రైనింగ్ పూర్తి చేసుకుని సెలవుపై ఇంటికి వచ్చాడు. 18 రోజులు ఉంటివద్ద ఉన్న అతడు ఈనెల 6న పంజాబ్‌లో విధుల్లో చేరేందుకు వెళ్లాడు. 8న తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తాను చనిపోతున్నానని చెప్పి కట్ చేశాడు. కుటుంబ సభ్యులు తిరిగి ఫోన్ చేయగా కలువలేదు. దీంతో వెంటనే అక్కడ ఉన్న క్యాంపు ఆర్మీ అధికారికి ఫోన్ చేయగా అతడు డ్యూటీలో ఉన్నాడని తెలిపారు. అదే అధికారి తిరిగి ఆరోజు రాత్రి ఫోన్ చేసి మీ అబ్బాయి కనిపించడం లేదని తెలిపాడు. కుటుంబసభ్యులు సీపీ అనురాధను కలిసి సమస్యను విన్నవించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపి తమ కుమారుడి ఆచూకీ కనుగొనాలని కోరుతున్నారు.

అత్యాచారయత్నం.. నిందితుడికి ఐదేళ్ల జైలు

జహీరాబాద్: బాలికపై అత్యాచారయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ కోర్టు బుధవారం తీర్పునిచ్చింది. చిరాగ్‌పల్లి పోలీసుల వివరాల ప్రకారం.... పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో ఇంటివద్ద ఉన్న బాలికపై (14), 2020 జూలై 7వ తేదీన అదే గ్రామానికి చెందిన నిందితుడు రాథోడ్ సంజీవ్(30) ఆమె ఇంట్లోకి వెళ్లి లైంగికదాడికి యత్నించాడు. బాలిక భయపడి అరవగా నిందితుడు ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించి పారిపోయాడు. అప్పట్లో ఆ వ్యక్తిపై బాధితురాలి సంబంధీకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ కేసు నమోదు చేశారు. ఇన్వెస్టిగేషన్ అనంతరం న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు పూర్వపరాలు విన్న జడ్జి జయంతి నిందితుడు రాథోడ్ సంజీవ్‌కు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10వేలు జరిమాన విధించింది. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ సూర్‌రెడ్డి, ఇన్వెస్టిగేషన్ అధికారి కె.గణేశ్, ఎస్ఐ రాజేందర్ రెడ్డి, కానిస్టేబుల్ కృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌ను ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు.

దివ్యమైన విజయం

స్ఫూర్తిగా నిలుస్తున్న దివ్యాంగులు
- మ్యూజిక్ ఆర్కెస్ట్రాతో ఉపాధి
- ఆత్మస్థైర్యంతో ముందడుగు
- ప్రతిభకు చేయూతనిచ్చిన అప్పటి కలెక్టర్

జిన్నారం (పటాన్‌చెరు): ప్రతికూలతలను అధిగమిస్తూ అసమాన విజయాలు సాధించే దివ్యాంగులు అందరికీ ఆదర్శమని ఈ దివ్యాంగ జంట నిరూపించింది. మండల కేంద్రానికి చెందిన లక్ష్మి, నాగేశ్ దంపతులిద్దరూ పుట్టుకతోనే అంధులు. నగేశ్ ఇంటర్ వరకు చదవగా, లక్ష్మి పదవ తరగతి చదివింది. వీరిద్దరూ ఐదేళ్లుగా ఓ ఆర్కెస్ట్రాలో పని చేస్తూ ఉపాధి పొందుతున్నారు. తమ సొంత కాళ్లపై నిలబడేందుకు అండగా నిలవాలని ప్రభుత్వాన్ని కోరారు. అప్పటి కలెక్టర్ వల్లూరు క్రాంతి వారిలోని ప్రతిభను ప్రోత్సహిస్తూ వారికి అక్షరాల రూ.లక్షా20 వేల ఆర్థిక సహాయం అందజేసింది. బయట పని చేయడం మానేసి అందిన సాయంతో సొంత ఆర్కెస్ట్రాను ఏర్పాటు చేసుకున్నారు. మరో 10 మంది దివ్యాంగులకు ఉపాధి కల్పించేందుకు సిద్ధమయ్యారు.

స్టూడియో ఏర్పాటు

దివ్యాంగ దంపతులైన లక్ష్మి, నగేశ్ తమ మదిలోని ఆలోచనలకు శ్రీకారం చుట్టి దివ్యాంగ మ్యూజిక్ స్టూడియో ఏర్పాటు చేశారు. ఈ స్టూడియో ద్వారా పలు శుభకార్యాలకు, కచేరీ కార్యక్రమాలకు సొంత ఆర్కెస్ట్రాను అభివృద్ధి చేసుకునేలా ముందుకు వెళ్తున్నారు. ఇప్పటికే కొనుగోలు చేసిన సంగీత పరికరాలతో నిత్యం సాధన చేస్తున్నారు. వీరితో పాటు మరో 10 మంది దివ్యాంగులను జత చేసుకుని తమ కలలను సాకారం చేసుకునేందుకు కృషి చేస్తున్నారు.

బృందంగా ఏర్పడి..

లక్ష్మి, నగేశ్ ఏర్పాటు చేసుకున్న ఆర్కెస్ట్రా బృందంలో కొంతమంది దివ్యాంగులను సభ్యులుగా చేసుకున్నారు. వీరిలో కిష్టయ్యపల్లికి చెందిన సుమలత పాటలు పాడుతోంది. రవి కాంగో వాయిస్తాడు. సువర్ణ, నాగమణి, భాగ్యలక్ష్మి కోరస్‌కు సహకారం అందిస్తున్నారు. వీరందరూ కలిసి ఒకే చోట శిక్షణ కొనసాగిస్తూ ఉపాధి అవకాశాలను సృష్టించుకుంటున్నారు. ఆర్కెస్ట్రా బృందాన్ని ఏర్పాటు చేసుకున్న వారిని చూసి మండలవాసులు కొనియాడుతున్నారు. జీవితాన్ని సాఫీగా సాగించేందుకు శాయశక్తులా కృషిచేస్తున్న వారి పోరాట పటిమను పలువురు అభినందిస్తున్నారు.


సంగీత పరికరాలతో పాటలు సాధన చేస్తున్న లక్ష్మి, నగేశ్ దంపతులు